సాక్షి జయశంకర్ భూపాలపల్లి

గురువారం | 17 | అక్టోబర్ | 2024



విభజన.. విస్మరింపు..

అధికారులు, ఉద్యోగులకు పదోన్నతి, బదిలీ ప్రక్రియ కొనసాగించిన టీజీ ఎన్పీడీసీఎల్ నూతన కార్యాలయాలకు స్వీపర్లు, వాచ్‌మెన్ల విభజనను విస్మరించింది. - 8లో▸



అభివృద్ధి బాటలో పయనించాలి

మేడారం సమ్మక్క, సారలమ్మ ఆశీస్సులతో రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనించాలని మంత్రి కొండా సురేఖ అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం 33.2°/25.3°

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో సాధారణ పరిస్థితి ఉంటుంది. రాత్రి సమయంలో అక్కడక్కడా చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మహారాష్ట్రలో ఎన్నికల కోడ్

- నరిహద్దుల గుండా ప్రయాణించే వారికి సూచన

కాళేశ్వరం: మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికల నగారా మోగింది. దీంతో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. జిల్లా మీదుగా కాళేశ్వరం వంతెన గుండా మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా సిరొంచ ప్రాంతానికి వెళ్లేవారు, అక్కడి నుంచి మంచిర్యాల జిల్లా చెన్నూర్ వైపునకు వెళ్లేవారు ఎన్నికల కోడ్ నేపథ్యంలో రూ.50వేలకు మించి నగదు తీసుకువెళ్లరాదు. ఒక వేళ తీసుకెళ్తే సరైన ధ్రువపత్రాలు కలిగి ఉండాలి. తెలంగాణ నుంచి మహారాష్ట్రకు ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాల్లో భారీగా గిఫ్టులు, అక్రమంగా మద్యం, మారణాయుధాలు, డ్రగ్స్, గంజాయి లాంటివి తరలిస్తే ఫ్లయింగ్‌స్క్వాడ్ సీజ్ చేసి కేసు నమోదు చేస్తుంది. ఎన్నికల కోడ్ నవంబర్ 23 ఎన్నికల ఫలితాల వరకు ఉండనుంది.

ఆర్చరీలో అనయ ప్రతిభ



కాటారం: మండల కేంద్రానికి చెందిన రామిళ్ల రాజశేఖర్ కూతురు అనయ చిన్న వయసులోనే ఆర్చరీలో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి విభాగాల్లో ప్రతిభ కనబర్చి ఔరా అనిపిస్తుంది. ఈ నెల 15, 16 తేదీల్లో హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన స్పోర్ట్స్ ఫర్ ఆల్ చాంపియన్ షిప్(ఎస్ఎఫ్ఏ)లో అనయ పాల్గొంది. అండర్-10 కాంపౌండ్ విభాగంలో తన సత్తా చాటి రాష్ట్రస్థాయిలో సిల్వర్ మెడల్ సాధించింది. సిల్వర్ మెడల్ సాధించడం పట్ల ఆమె తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో పాటు కోచ్ శ్రీనివాస్ హర్షం వ్యక్తంచేస్తూ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

రేపు కౌన్సెలింగ్

భూపాలపల్లి అర్బన్: ఏరియాలో ఖాళీగా ఉన్న సింగరేణి క్వార్టర్లను కేటాయించేందుకు ఈ నెల 18న కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు ఏరియా అధికార ప్రతినిధి మారుతి తెలిపారు. క్వార్టర్ల ఖాళీలు, కౌన్సిలింగ్‌పై బుధవారం జీఎం కార్యాలయంలో సమీక్షా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఏరియాలో మొత్తం 5,423మంది ఉద్యోగులకు గాను 4,751 క్వార్టర్లు ఉన్నాయన్నారు. వాటిలో ప్రభుత్వ కార్యాలయాలు, అధికారులకు నిబంధనల ప్రకారం అద్దె ప్రాతిపదికన 133 క్వార్టర్లు కేటాయించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న 169 క్వార్టర్లకు పారదర్శకంగా సీనియారిటీ ప్రకారం బెటర్‌మెంట్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఖాళీ క్వార్టర్లు, సీనియారిటీ జాబితాను అన్ని గనుల నోటీసు బోర్డుల్లో అంటించి ఉద్యోగుల నుంచి అభ్యంతరాల స్వీకరణ చేయగా అభ్యంతరాలు రాలేదన్నారు. బెటర్ మెంట్ కౌన్సిలింగ్ పూర్తయ్యాక ఏర్పడే ఖాళీలకు క్వార్టర్ లేని వారికి కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఏరియాలో క్వార్టర్ లేని 1,099 ఉద్యోగులకు హెచ్ఆర్ఏ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అధికారులు, కార్మిక సంఘాల నాయకులు కవీంద్ర, రవికుమార్, రమేష్, రాంచందర్, బుచ్చయ్య, రాజేందర్ పాల్గొన్నారు.

సెక్యూరిటీ అధికారిని కలిసిన సీఐటీయూ నాయకులు



భూపాలపల్లి అర్బన్: సింగరేణి సెక్యూరిటీ అధికారిగా భూపాలపల్లి ఏరియాకు బదిలీపై వచ్చిన సిలివేరు మురళీమోహన్‌ను బుధవారం సీఐటీయూ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందజేశారు. సెక్యూరిటీ గార్డుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఏరియాలోని సింగరేణి ఆస్తులను కాపాడాలని ఈ సందర్భంగా సీఐటీయూ బ్రాంచ్ కార్యదర్శి కంపేటి రాజయ్య కోరారు.

టీకాలు వేయించాలి




మొగుళ్లపల్లి: గాలికుంటు వ్యాధి నివారణకు రైతులు సకాలంలో పశువులకు టీకాలు వేయించాలని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ కుమారస్వామి సూచించారు. మండలంలోని అంకుషాపూర్, మొట్లపల్లి గ్రామాల్లో బుధవారం పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు ఉచితంగా గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్నామన్నారు. మండలంలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నెల రోజుల పాటు టీకాల కార్యక్రమం ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గోపాలకృష్ణ, డాక్టర్ రాకేష్ శర్మ, వెటర్నరీ అసిస్టెంట్ శారద, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

మెరుగుపడేనా!

తీరిన ఉపాధ్యాయుల కొరత

- విధుల్లో చేరిన 212మంది ఉపాధ్యాయులు
- మూడేళ్లుగా జిల్లాలో టీచర్ల కొరత
- ఇప్పటివరకు అంతంత మాత్రమే విద్యాబోధన
- అధికారులు పర్యవేక్షణ చేస్తే విద్యార్థులకు ప్రయోజనం



భూపాలపల్లి అర్బన్: జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక ఏళ్ల తరబడి విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలు పాఠశాలలు ఉపాధ్యాయులు లేక మూతపడ్డాయి, ఉన్న విద్యార్థులకు సరైన విద్య అందకపోవడంతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. ఇటీవల నిర్వహించిన డీఎస్సీతో జిల్లాలోని పాఠశాలల్లో ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేశారు. మారుమూల ప్రాంతాలకు ప్రాధాన్యం ఇచ్చారు. బుధవారం నూతనంగా 212మంది ఉపాధ్యాయులు విధుల్లో చేరారు. అంతేకాకుండా ఇటీవల మండల విద్యాశాఖ అధికారులుగా సీనియర్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.

ఖాళీలు భర్తీ..

జిల్లాలో మూడునాలుగేళ్లుగా ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉంది. విద్యావాలంటరీల నియామకం లేకపోవడంతో ప్రస్తుతం పనిచేస్తున్న ఉపాధ్యాయులనే సర్దుబాటు చేశారు. అయినప్పటికీ విద్యార్థులకు అంతంత మాత్రమే విద్య అందేది. ప్రధానంగా పలిమెల, మహాముత్తారం మండలాల్లో ఉపాధ్యాయుల కొరత అధికంగా ఉండటమే కాకుండా పాఠశాలలకు ఒక్క ఉపాధ్యాయుడు కూడా లేని పరిస్థితులను అధిగమించారు. ఇటీవల చేపట్టిన ఉపాధ్యాయుల కేటాయింపులో మారుమూల ప్రాంతాలకే అధికారులు అధిక ప్రాధాన్యత ఇచ్చి ఉపాధ్యాయులను భర్తీచేశారు.

విద్యాబోధన మెరుగుపడాలి..

ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ ఖాళీలు భర్తీఅయ్యాయి. గతం నుంచి పని చేసిన ఉపాధ్యాయులతో పాటు నూతనంగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులందరూ విద్యార్థుల భవిష్యత్ గురించి ఆలోచించి.. వెనుకబడిన విద్యాబోధనను మెరుపర్చాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. పలు పాఠశాలల్లో ఇప్పటి వరకు పాఠాల బోధన కూడా ప్రారంభం కాకపోవడం శోచనీయం. విద్యార్థుల సంఖ్యను కూడా పెంచాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉంది. జిల్లావ్యాప్తంగా 432 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 22వేల మంది విద్యార్థులు ఉన్నారు. మొత్తంగా 1,829 మంది ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా.. ఇప్పటివరకు 1,393 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వర్తించారు. 436 ఉపాధ్యాయ ఖాళీలు ఉండగా ఈ డీఎస్సీ ద్వారా 212మంది ఉపాధ్యాయులను నియమించారు.

అధికారుల పర్యవేక్షణ పెరిగేనా..

డీఈఓతో పాటు ఎంఈఓలు ప్రతీ రోజు పాఠశాలలను పర్యవేక్షించాల్సిన బాధ్యత ఉంది. గత నెలలో ప్రభుత్వం ప్రతీ మండలానికి ఇన్‌చార్జ్ ఎంఈఓలను నియమించింది. నాలుగేళ్లుగా జిల్లాలోని 11 మండలాలకు ముగ్గురు ఇన్ చార్జ్ ఎంఈఓలు మాత్రమే విధులు నిర్వర్తించారు. పాఠశాలలపై పర్యవేక్షణ తగ్గడంతో మండలంలో సీనియర్ ప్రధానోపాధ్యాయులకు అదనపు బాధ్యతలు అప్పగించింది. గతంలో నాలుగైదు మండలాలకు ఒక్కరే ఎంఈఓ ఉండటంతో పర్యవేక్షణ మరిచి కేవలం కార్యాలయానికి పరిమితమై ఉపాధ్యాయుల పనులు, రిపోర్టుల తయారీకి మాత్రమే పరిమితమయ్యారు. నూతనంగా ఇన్‌చార్జ్ బాధ్యతలు స్వీకరించిన ఎంఈఓలు ప్రతీ పాఠశాలను తనిఖీ చేసి పర్యవేక్షణ చేస్తేనే విద్యాభివృద్ధి చెందుతుంది.

అంతంత మాత్రమే..

పలు మండలాల్లో ఇప్పటివరకు స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ, పీఈటీలు కలిపి 436 ఖాళీలు ఉండేవి. దీంతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సరైన విద్య అందలేదు. దీనికి నిదర్శనం పదో తరగతి ఫలితాల్లో గతంలో రాష్ట్రంలో 5, 7స్థానంలో ఉన్న జిల్లా గతేదాది 16వ స్థానానికి పడిపోయింది. వారితో పాటు 1 నుంచి 9వ తరగతి విద్యార్థులకు అన్ని సబ్జెక్ట్‌లకు ఉపాధ్యాయులు లేకపోవడంతో ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై ఇతర పాఠశాలలకు పంపించడంతో నామమాత్రంగానే విద్యాబోధన చేశారని పలువురు విద్యార్థులు ఆరోపిస్తున్నారు.



విధుల్లో చేరుతున్న ఉపాధ్యాయుడు



చిట్యాల: విధుల్లో చేరిన ఉపాధ్యాయులు

కంకర తేలిన రోడ్డు



కంకర తేలిన రోడ్డు

అడుగడుగునా గుంతలే..

అధ్వానంగా రేగొండ-భాగిర్థిపేట రోడ్డు

- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



పెద్దంపల్లి - భాగిర్థిపేట రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలు



పెద్దంపల్లి సమీపంలో రోడ్డు మధ్యలో గుంత

రేగొండ: మండల కేంద్రం నుంచి పెద్దంపల్లి మీదుగా భాగిర్థిపేట వెళ్లే మార్గంలో ఉన్న ఐదు కిలోమీటర్ల బీటీ రోడ్డు గుంతలమయంగా మారింది. నిత్యం వివిధ పనుల నిమిత్తం భాగిర్థిపేట, దుంపిల్లపల్లి గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి వచ్చి వెళ్తుంటారు. రోడ్డు గుంతలమయంగా మారడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు 20 ఏళ్ల కిందట నిర్మించిన ఈ రోడ్డుకు ప్రారంభం నుంచి చివరి వరకు గుంతలు ఏర్పడ్డాయి.

మలుపులు.. పిచ్చిమొక్కలు

మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం నుంచి భాగిర్థిపేట వరకు ఉన్న రోడ్డుపై అడుగడుగునా కంకరతేలి అధ్వానంగా మారింది. కిలోమీటర్ల కొద్ది కంకరతేలి గుంతలు ఏర్పడ్డాయి. చిన్నపాటి వర్షానికే రోడ్లపై నీరు నిలుస్తుండటంతో వాహనదారులు అదుపుతప్పి కింద పడుతున్నారు. వాహనాలు సైతం తరుచుగా ప్రమాదాలకు గురవుతున్నాయి. రోడ్డు వెంబడి మలుపుల వద్ద పిచ్చిమొక్కలు గుబురుగా పెరిగాయి. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనబడకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. సంబంధిత అధికారులు మలుపుల వద్ద సూచిక బోర్డులు మరిచిపోగా, పంచాయతీ అధికారులు పిచ్చిమొక్కలను తొలగించడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పిచ్చిమొక్కలను తొలగించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

కంకర తేలిన రోడ్డుతో అవస్థలు..



ప్రతీ రోజు పెద్దంపల్లి నుంచి భాగిర్థిపేట వైపు వ్యవసాయ పనులకు బైక్‌పై వెళ్తుంటాం. రోడ్డంతా దెబ్బతిని కంకర రాళ్లు తేలాయి. బైక్‌పై ఒకరు వెళ్తేనే అదుపుతప్పి పడిపోతామని భయపడుతున్నాం. ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి.

– కొడగాని రాకేష్, పెద్దంపల్లి గ్రామస్తుడు

మరమ్మతులు చేపట్టాలి



మండల కేంద్రం నుంచి భాగిర్థిపేట వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉంది. రోడ్డు వెంబడి ఉన్న పిచ్చిమొక్కలను తొలగించాలి. ప్రమాద సూచిక బోర్డులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి.

– పసుల వినయ్‌కుమార్, భాగిర్థిపేట గ్రామస్తుడు

నూతన కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ రాహుల్‌శర్మ



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి అర్బన్: ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో కొత్తగా ప్రవేశ పెట్టిన ఆరు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకొని కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో ఐటీఐ ప్రాంతీయ ఉప సంచాలకులు, భూపాలపల్లి, కాజీపేట ఐటీఐ ప్రిన్సిపాళ్లతో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌లో ప్రవేశాలు, కళాశాలలో సౌకర్యాలు కల్పనపై కలెక్టర్ బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 10వ తరగతి ఆపై విద్యార్హతలు కలిగిన విద్యార్థులు ఐటీఐ కళాశాలలో నేరుగా, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని అడ్మిషన్లు పొందాలన్నారు. ఈ నెల 19వ తేదీ వరకు అవకాశం ఉన్నట్లు తెలిపారు. 6వ విడత వాక్-ఇన్ ఇంటర్వ్యూ ద్వారా అడ్మిషన్లకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఇతర వివరాలకు ప్రభుత్వ ఐటీఐ భూపాలపల్లి, 89851 00563 నంబర్‌కు కాల్ చేసి సమగ్ర సమాచారం తెలుసుకోవచ్చన్నారు. సమయం రెండు రోజులు మాత్రమే ఉన్నందున విద్యార్థులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉందని, విద్యార్థులకు ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఐటీఐ కళాశాలలో పారిశుద్ధ్య సమస్య, విద్యుత్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. మున్సిపల్ అధికారులు అంచనాలు తయారు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రాంతీయ ఉప సంచాలకులు బి.సీతారాములు, భూపాలపల్లి ఐటీఐ ప్రిన్సిపాల్ జుమ్లా నాయక్, కాజీపేట కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

భూపాలపల్లి అర్బన్: ఉమ్మడి వరంగల్ జిల్లాలో యువజన సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించడానికి యువజన సంఘాల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి చింతల అన్వేష్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నెహ్రూ యువ కేంద్ర వరంగల్ (ఉమ్మడి జిల్లాలు), యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సంఘాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. యువజన సంఘంలోని సభ్యుల వయసు 18 సంవత్సరాల నుండి 29 సంవత్సరాల లోపు ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో రిజిస్ట్రేషన్ చేసుకున్నా.. చేసుకోకపోయినా ఆసక్తిగల యువజన సంఘాల నాయకులు తమ ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను, యువజన సంఘ ప్రతులతో హనుమకొండ న్యూ బస్టాండ్ సమీపంలో గల నెహ్రూ యువ కేంద్ర కార్యాలయంలో ఈనెల 19వ తేదీ లోపు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. మరిన్ని వివరాల కోసం 0870-2958776 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఐదుగురికి జైలు

భూపాలపల్లి అర్బన్/చిట్యాల/మల్హర్: మద్యం తాగి వాహనాలు నడిపిన ఐదుగురికి బుధవారం భూపాలపల్లి సివిల్ జడ్జి రామచంద్రరావు జైలుశిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారు. భూపాలపల్లి సీఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని భాస్కర్‌గడ్డకు చెందిన బొల్లి లక్ష్మయ్య, కృష్ణ కాలనీకి చెందిన కుమ్మరి ఎల్లయ్య మద్యం సేవించి ద్విచక్ర వాహనం నడుపు భూపాలపల్లి పోలీసులకు పట్టుపడ్డారు. దీంతో పోలీసులు బుధవారం కోర్టులో హాజరు పరిచారు. రెండు రోజుల జైలు శిక్షతో పాటు వెయ్యి రూపాయల జరిమానా విధించారు. మల్హర్ మండలంలోని కొయ్యూరు గ్రామానికి చెందిన రవినాయక్, పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఖమ్మంపల్లి గ్రామనికి చెందిన కుమార్ కొన్ని రోజుల క్రితం మద్యం తాగి వాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డారు. కొయ్యూరు ఎస్సై వడ్లకొండ నరేష్ ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం ఇరువురిని కోర్టులో హాజరుపర్చారు. ఇరువురికి రెండు రోజుల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ జడ్జి రామచంద్రరావు తీర్పు వెల్లడించారు. కోర్టు తీర్పు ప్రకారం ఇరువురిని పరకాల సబ్ జైలుకు తరలించినట్లు ఎస్సై నరేష్ పేర్కొన్నారు. చిట్యాల మండలంలోని చింతకుంటరామయ్యపల్లి గ్రామానికి చెందిన పడిదల దేవేందర్‌రావుకు డ్రంకెన్ డ్రైవ్‌లో జడ్జి రామచంద్రరావు రెండు రోజుల జైలు శిక్షతో పాటు రూ.1000జరిమానా విధించినట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అంతర్గత పోరు.. ఎటువైపు?

ఆసక్తికరంగా ఓరుగల్లు కాంగ్రెస్ రాజకీయాలు

- మంత్రి కొండాపై రాష్ట్ర పెద్దలకు ఎమ్మెల్యేల ఫిర్యాదు
- పంచాయితీ తేల్చేందుకు ఓ ముఖ్యనేతకు బాధ్యతలు

సాక్షి, వరంగల్ : ఉమ్మడి వరంగల్ కాంగ్రెస్‌పార్టీలో 'కొండ'ంత మంటలు రగులుతున్నాయి. మంత్రి కొండా సురేఖ వ్యవహార శైలిపై కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్‌మున్షీకి మంగళవారం ఉమ్మడి జిల్లాకు చెందిన ఐదుగురు ఎమ్మెల్యేలు, ఓ ఎమ్మెల్సీ ఫిర్యాదు చేయగా, బుధవారం టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్‌ను కలవడం ఆ పార్టీలో హాట్ టాపిక్‌గా మారింది. తమ నియోజకవర్గాల్లో తన మద్దతుదారులకు ప్రధాన ఆలయ కమిటీ నియామకాల్లో అందలం వేస్తున్నారని, సమయం సందర్భం లేకుండా అన్ని విషయాల్లో కలగజేసుకుంటూ ఇబ్బంది పెడుతున్నారని ఫిర్యాదు చేశారన్న వార్తలతో కాంగ్రెస్ పార్టీలో అంతర్గత పోరు తారస్థాయికి చేరినట్లయింది. ఇప్పటికే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను టార్గెట్ చేసే క్రమంలో సినీహీరో అక్కినేని నాగార్జున కుటుంబాన్ని కార్నర్ చేయడంతో విమర్శలు ఎదుర్కొన్న కొండా సురేఖ...ఇప్పుడు పరకాల నియోజకవర్గం గీసుకొండ మండలంలో ఫ్లెక్సీ వివాదంలో ఏకంగా ఠాణాకు వెళ్లి హల్‌చల్ చేశారు. దీంతో సొంత పార్టీ ఎమ్మెల్యేలనుంచే వ్యతిరేకత ఎదుర్కొంటుండడం జిల్లా రాజకీయాల్లో సంచలనంగా మారింది. తమ నియోజకవర్గాల్లో మంత్రి కొండా సురేఖ కలగజేసుకుంటూ ఇబ్బందులు సృష్టిస్తున్నారంటూ ఎమ్మెల్యేలు పార్టీ అధిష్టానం ముందు పెట్టి కొండాకు బ్రేక్ వేసేలా ముందుకెళుతున్నారని రాజకీయాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే మంత్రిపై ఫిర్యాదు చేసిన ఉమ్మడి వరంగల్ ఎమ్మెల్యేలతో, ఆ తర్వాత మంత్రితో సమావేశమై అసలు కారణాలు తెలుసుకునేందుకు ఓ రాష్ట్ర మంత్రికి బాధ్యతలు అప్పగించినట్లుగా చర్చ సాగుతోంది. స్థానిక సంస్థల ఎన్నికలు ముందున్న వేళ పార్టీని సమన్వయం చేస్తారా, లేదా పార్టీకి ఇబ్బంది కలిగిస్తున్నవారి విషయంలో కఠినంగా వ్యవహరిస్తారా అని హస్తం పార్టీ శ్రేణులు చర్చించుకుంటున్నాయి. దీంతో వరంగల్ వేదికగా కాంగ్రెస్‌పార్టీ రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి.

అక్రమ రవాణాను అరికట్టాలి

ములుగు రూరల్: పశువుల అక్రమ రవాణాను అరికట్టాలని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్ అన్నారు. ఈ మేరకు బుధవారం జంగాలపల్లి నుంచి ములుగు వైపు పశువులను తరలిస్తున్న వాహనాన్ని అడ్డుకుని పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిపారు. టాటా గూడ్స్ వాహనంలో 14 పశువులను తరలిస్తున్నారని వివరించారు.

విద్యార్థులు ప్రణాళికతో చదవాలి

గోవిందరావుపేట: విద్యార్థులు ప్రణాళికతో చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల స్పెషల్ ఆఫీసర్ మడి వెంకటలక్ష్మి అన్నారు. మండల పరిధిలోని చల్వాయి కస్తూర్బా గాంధీ పాఠశాలలోని బాలికలకు బుధవారం బాలరక్ష భారత్, విద్యాశాఖ ములుగు వారి ఆధ్వర్యంలో లైబ్రరీ బుక్స్, స్టేషనరీ వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని 9 మండలాల్లోని 50 పాఠశాలల్లో విద్యార్థులకు లైబ్రరీ బుక్స్, స్టేషనరీ బాలరక్ష భారత్, జిల్లా విద్యాశాఖ వారి ఆధ్వర్యంలో 6వ తరగతి పిల్లల నుంచి ఇంటర్ చదివే పిల్లల వరకు అందిస్తున్నామని తెలిపారు. అందరూ చదవాలి, అందరూ ఎదగాలి అనే ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. బాలరక్ష భారత్ ప్రతినిధి తేజావత్ రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్‌కు లైబ్రరీ బుక్స్ ఎంతగానో ఉపయోగపడుతాయని తెలిపారు. పాఠశాల అనేది పిల్లలకు అత్యంత సురక్షితమైన ప్రదేశం అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తకాలు, డస్ట్‌బిన్‌ల అందజేత

మంగపేట: మండల పరిధిలోని రాజుపేట జెడ్పీ ఉన్నత పాఠశాలకు బాలరక్ష భారత్ ఆధ్వర్యంలో ప్యూర్ ప్లే స్వచ్ఛంద సంస్థ సహకారంతో గ్రంథాలయ పుస్తకాలు, డస్ట్ బిన్‌లను బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బానోతు బాలాజీ, బాలరక్ష భారత్ కోఆర్డినేటర్ రమేష్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిన్న కాళేశ్వరం పనుల సర్వే అడ్డగింత



సర్వేను అడ్డుకుని నినాదాలు చేస్తున్న రైతులు

కాటారం: చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో భాగంగా కాటారం మండలం ప్రతాపగిరి చెరువు వద్ద కొనసాగుతున్న సర్వేను బుధవారం గ్రామ రైతులు అడ్డుకున్నారు. చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా చెరువుల్లో నీరు నింపడం కోసం అనుసంధాన కాల్వల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు రైతుల భూముల్లో సర్వే మొదలుపెట్టారు. సమాచారం తెలుసుకున్న రైతులు సర్వే నిలిపివేయాలని అధికారుల ఎదుట నిరసన తెలిపారు. కాల్వలు తీయడం ద్వారా చిన్న, సన్నకారు రైతులు భూములు కోల్పోయి ఉపాధి కష్టమవుతుందన్నారు. ప్రాజెక్ట్ ద్వారా నీరు అందిస్తే రెండు పంటలు సాగు చేసుకుంటామని కానీ అనుసంధాన కాల్వలు తీస్తే తీవ్రంగా నష్టపోతామని అధికారులకు విన్నవించారు. పనులు అడ్డుకున్న వారిలో రైతులు రాజబాబు, రమేష్, మాధవ్, కిష్టయ్య, పర్వతాలు, పోచయ్య, లింగయ్య, సమ్మయ్య ఉన్నారు.

వృద్ధుడిని కాపాడిన పోలీసులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం గోదావరిలో పడి మృతి చెందాలని వచ్చిన వృద్ధుడిని పోలీసులు బుధవారం కాపాడారు. పాత్కపల్లి మండలం గుంపుల గ్రామానికి చెందిన బండారి ఓదెలు(70) భార్య గతంలోనే మృతిచెందడంతో వయోభారం మీద పడి మనస్తాపం చెందాడు. చనిపోవాలని నిర్ణయించుకుని కాళేశ్వరం వచ్చాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై చక్రపాణి తన సిబ్బందితో వచ్చి వృద్ధుడితో మాట్లాడి తన కుమారుడికి సమాచారం అందజేశారు.

ఘనంగా కౌముదీ పూజ

కాళేశ్వరం: కోజాగిరి పౌర్ణమి సందర్భంగా మహదేవపూర్ మండలం కాళేశ్వరం దేవస్థానంలో ఆలయ అర్చకులు కౌముదీ పూజ ఘనంగా నిర్వహించారు. బుధవారం రాత్రి ఆలయ ప్రధాన అర్చకుడు త్రిపురారి కృష్ణమూర్తిశర్మ ఆధ్వర్యంలో మంత్రోచ్ఛరణల నడుమ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తాంబాళంలో క్షీరానికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం క్షీరం(పాలు)లో చంద్ర బింబాన్ని భక్తులు వీక్షించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈకార్యక్రమంలో దేవస్థానం అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ట్రెయినీ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లకు శిక్షణ



ట్రెయినీ బ్యాచ్‌కు శిక్షణ ఇస్తున్న వంశీకృష్ణ

గోవిందరావుపేట: శిక్షణ నిమిత్తం తెలంగాణ ఫారెస్ట్ అకాడమీ నుంచి 33 మంది ట్రెయినీ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు బుధవారం మండలంలోని లక్నవరం చేరుకున్నారు. ఈ సందర్భంగా పస్రా ఫారెస్ట్ రేంజర్ మాధవీశీతల్ ఆధ్వర్యంలో ఎఫ్‌బీఓ ట్రైనీ కోఆర్డినేటర్, దూలపల్లి రేంజర్ ఎం.వంశీకృష్ణ శిక్షణ ఇచ్చారు. శిక్షణలో భాగంగా 8 కిలోమీటర్లు ట్రెక్కింగ్, క్యాంపింగ్ సైట్, తూముల ఏరియా, ఎకో పార్క్‌లను తిప్పారు. లక్నవరం అడవుల్లోని వివిధ చెట్లను చూపించి వాటి గురించి క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో పస్రా రేంజ్ స్టాఫ్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ వేణుగోపాల్ రెడ్డి, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ టి. దీప్‌లాల్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టిజన్లుగా గుర్తించాలి

హన్మకొండ : విద్యుత్ సంస్థల్లో మిగతా కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను ఆర్టిజన్‌లుగా గుర్తించాలని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ జేఏసీ చైర్మన్ కె.ఈశ్వర్ రావు, సీఐటీయూ హనుమకొండ జిల్లా కార్యదర్శి రాగుల రమేశ్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల్లో 23,667 మందిని మాత్రమే ఆర్టిజన్‌లుగా సంస్థల్లోకి తీసుకున్నారని, ఇంకా 19,587 మంది మిగిలారని వారు బుధవారం ఒక ప్రకటనలో వివరించారు. వీరిని ఆర్టిజన్‌లుగా గు ర్తించాలని కోరుతూ ఈ నెల 17వ తేదీన హనుమకొండలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా చేయనున్నట్లు తెలిపారు. ఈ ధర్నాకు ఎన్పీడీసీఎల్ పరిధిలోని కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులు తరలివచ్చి విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

పాడి పత్తికి గరిష్ఠ ధర

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు పాడి పత్తిని తీసుకువచ్చి రైతులు అత్యధిక ధర పొందాలని మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.నిర్మల బుధవారం ఒక ప్రకటనలో కోరారు. పత్తిని నీళ్లు చల్లి తీసుకురావొద్దని, తడి ఎక్కువ ఉంటే పత్తి నాణ్యత దెబ్బతింటుందన్నారు. పత్తి రంగు మారి గింజలు బూజు పట్టి నాణ్యత పడిపోయి గింజల నుంచి నూనె తక్కువ వస్తుందన్నారు. అందుకే వ్యాపారులు తక్కువ ధర చెల్లించే అవకాశాలున్నాయన్నారు. పాడి పత్తి తీసుకొచ్చి అధిక ధర పొందాలని రైతులకు సూచించారు.

క్షణికావేశంలో యువకుడి ఆత్మహత్య



కుమార్ (ఫైల్)

కేసముద్రం: తండ్రి బైక్ కొనివ్వలేదనే క్షణికావేశంలో ఓ యువకు డు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండల కేంద్రంలో జరిగింది. ఎస్సై మురళీధర్‌రాజు కథనం ప్రకా రం..గ్రామానికి చెందిన కాడబోయిన శ్రీనుకు ఇద్ద రు కుమారులున్నారు. చిన్న కుమారుడు కుమార్(24) ఇంటర్ పూర్తిచేసి ఇంటి వద్దే ఉంటూ వ్యవసా య పనులు చేస్తున్నాడు. ఈక్రమంలో ఈనెల 14న అన్నకు బైక్ ఉంది, నాకు కూడా కొనివ్వాలని తండ్రి ని అడిగాడు. దీంతో పంట డబ్బులు వచ్చాక కొని స్తానని తండ్రి చెప్పాడు. తనకు ఎలాగైనా బైక్ కొని వ్వాలంటూ కుమార్ గొడవ పడి బయటకు వెళ్లిపోయాడు. అదే రోజు మధ్యాహ్న సమయంలో తాను గుంటిచెరువు వద్ద పురుగుల మందు తాగానంటూ తన అన్నకు ఫోన్ చేసి చెప్పాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన వెళ్లి చూడగా కుమార్ అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే మానుకోటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈ ఘటనపై తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై మురళీధర్ రాజు తెలిపారు.

విభజన.. విస్మరింపు



ప్రతి ప్రభుత్వ శాఖ, ప్రభుత్వ రంగ సంస్థ కార్యాలయాలకు స్వీపర్లు, వాచ్‌మెన్‌లు ఉంటారు. స్వీపర్లు కార్యాలయాలను శుభ్రం చేస్తారు. నైట్‌వాచ్ మెన్లు కార్యాలయాలకు కాపలా ఉంటారు. అయితే అధికారులు, ఉద్యోగులకు పదోన్నతి, బదిలీల ప్రక్రియ కొనసాగించిన టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం.. నూతన కార్యాలయాలకు స్వీపర్లు, వాచ్‌మెన్ల విభజనను విస్మరించింది. ఫలితంగా అధికారులు, ఉద్యోగులు సొంతంగా చందాలు పోగు చేసుకుని ప్రైవేట్‌గా స్వీపర్‌ను నియమించుకుని కార్యాలయాలను శుభ్రం చేయించుకుంటుండగా, మరికొన్ని కార్యాలయాల్లో సొంతంగా ఎవరికి వారు శుభ్రం చేసుకుంటున్నారు.

స్వీపర్, వాచ్‌మెన్ పోస్టుల బైఫర్‌కేషన్ ఎప్పుడో?
- విద్యుత్ ఉద్యోగుల పదోన్నతి, బదిలీలు పూర్తి
- పూర్తి కాని కిందిస్థాయి పోస్టుల విభజన
- పాత కార్యాలయాల్లోనే విధులు నిర్వహిస్తున్న వైనం

హన్మకొండ : టీజీ ఎన్పీడీసీఎల్‌లో విద్యుత్ ఉద్యోగుల పదోన్నతి, బదిలీల ప్రక్రియ ముగిసింది. అయితే స్వీపర్, వాచ్‌మెన్ పోస్టుల బైఫర్‌కేషన్‌ను మాత్రం యాజమాన్యం, అధికారులు పట్టించుకోలేదు. సాధారణంగా ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయంలో కచ్చితంగా స్వీపర్, నైట్‌వాచ్ మెన్‌ను నియమిస్తారు. కార్యాలయం ఆస్తుల కాపలాకు నైట్‌వాచ్‌మెన్, కార్యాలయాన్ని నిరంతరం శుభ్రంగా ఉంచడానికి స్వీపర్ అవసరం. రాష్ట్రంలో జిల్లాల పునర్విభజన క్రమంలో టీజీ ఎన్పీడీసీఎల్‌లో సర్కిళ్లు, డివిజన్లు, సబ్‌డివిజన్, ఈఆర్‌ఓలు, సెక్షన్ కార్యాలయాల పునర్విభజన జరిగింది. ఈ మేరకు అన్ని స్థాయిల్లోని ఉద్యోగుల విభజన జరగాల్సి ఉండగా స్వీపర్, వాచ్‌మెన్‌లను మినహాయించి మిగతా స్థాయి ఉద్యోగులను సర్కిళ్లు, డివిజన్లు, సబ్ డివిజన్ల వారీగా విభజన చేశారు. ఫలితంగా నూతనంగా ఏర్పాటైన కార్యాలయాల్లో స్వీపర్ లేక కార్యాలయాన్ని శుభ్రం చేసే కరువయ్యారు. నైట్ వాచ్‌మెన్ లేక కార్యాలయాలకు కాపలా లేకుండా పోయింది.

అధికారులు, ఉద్యోగులు ఇబ్బందులు..

రాష్ట్రంలో జిల్లాల పునర్విభజనతో ఉమ్మడి వరంగల్ జిల్లా (సర్కిల్)లో పాలన సౌలభ్యం కోసం నూతన సర్కిళ్లు, డివిజన్లు, ఈఆర్‌ఓలు, సబ్ డివిజన్లు, సెక్షన్ కార్యాలయాలు ఏర్పాటు చేశారు. ఆయా కార్యాలయాలకు ఇంజనీర్లు, ప్రొవెన్షియల్, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ సిబ్బందిని సర్దుబాటు చేసి పోస్టింగ్‌లు ఇచ్చారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా.. స్వీపర్, నైట్ వాచ్‌మెన్ల విభజనను విస్మరించారు. ఫలితంగా వారు పాత కార్యాలయాల్లోనే విధులు నిర్వహిస్తున్నారు. దీంతో నూతన కార్యాలయాల్లో స్వీపర్లు, వాచ్‌మెన్‌లు లేక అధికారులు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. నూతన కార్యాలయాల ఏర్పాటు తర్వాత ఉద్యోగుల విభజనకు 2018, జూన్‌లో సర్కిల్ స్థాయి, డివిజన్ల వారీగా ఉద్యోగులను సర్దుబాటు చేసింది. కానీ స్వీపర్, వాచ్‌మెన్‌లను పట్టించుకోలేదు. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్ జిల్లాలో ఇంజనీర్లు, ప్రొవెన్షియల్, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్, స్వీపర్, వాచ్‌మెన్, లైన్‌మెన్ డ్రైవర్లను సర్దుబాటు చేశారు. కానీ ఒక్క ఉమ్మడి వరంగల్ సర్కిల్లో స్వీపర్, వాచ్‌మెన్, లైన్‌మెన్ డ్రైవర్ పోస్టులను పట్టించుకోకుండా వదిలేశారు. ఆ తర్వాత 20022 ఏప్రిల్లో సర్కిల్ స్థాయిలో స్వీపర్, వాచ్‌మెన్, లైన్‌మెన్, డ్రైవర్ల విభజన, సర్దుబాటు కోసం ఓ కమిటీ నియమించారు. అదే విధంగా డివిజన్ స్థాయిలో స్వీపర్, వాచ్‌మెన్, లైన్‌మెన్ డ్రైవర్ పోస్టుల విభజన, సర్దుబాటు కోసం మరో కమిటీని నియమించారు. ఈ కమిటీలను నియమించి రెండేళ్ల గడిచినా ఉలుకుపలుకు లేకుండా పోయింది.

నూతనంగా నాలుగు సర్కిళ్లు ఏర్పాటు

టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం ఉమ్మడి వరంగల్ జిల్లా (సర్కిల్) పరిధిలో నూతనంగా నాలుగు సర్కిళ్లు ఏర్పాటు చేసింది. హనుమకొండ సర్కిల్ ఆఫీస్ పూర్వ కార్యాలయంగా, నోడల్ కార్యాలయంగా పని చేస్తుండగా, వరంగల్, జనగామ, మహబూబాబాద్ పాటు జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలను కలిపి భూపాలపల్లి సర్కిల్‌ను ఏర్పాటు చేశారు. వీటితో పాటు డివిజన్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాలు కొత్తగా ఏర్పాటు చేశారు. ఈ కార్యాలయాలకు సబ్ ఇంజనీర్ స్థాయి నుంచి డివిజనల్ ఇంజనీర్ వరకు, జూనియర్ లైన్‌మెన్ నుంచి ఫోర్‌మెన్ వరకు, జూనియర్ అసిస్టెంట్ మంచి సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ వరకు అధికారులు, ఉద్యోగుల విభజన చేసి పోస్టులు మంజూరు చేసి భర్తీ చేసిన యాజమాన్యం.. స్వీపర్, వాచ్‌మెన్ పోస్టుల విభజనను పట్టించుకోకపోవడాన్ని విద్యుత్ అధికారులు, ఉద్యోగులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా నూతన కార్యాలయాలకు స్వీపర్, నైట్ వాచ్‌మెన్లను నియమించాలని వారు యాజమాన్యాన్ని కోరుతున్నారు.

రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనించాలి

- దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ
- మేడారంలో వనదేవతలకు మొక్కుల చెల్లింపు

ఎస్ఎస్ తాడ్వాయి: మేడారం సమ్మక్క, సారలమ్మల ఆశీస్సులతో రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనించాలని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. బుధవారం మేడారం సమ్మక్క, సారలమ్మలను మంత్రి కొండా సురేఖ, మురళీధర్ దంపతులతో పాటు వారి కూతురు సుస్మిత పటేల్, అల్లుడు అభిలాష్, మనవడు శ్రీయాష్ మురళీకృష్ణ పటేల్‌తో కలిసి అమ్మవార్లను దర్శించుకుని నిలువెత్తు బంగారం మొక్కులు సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ సమ్మక్క, సారలమ్మ జాతరను జాతీయ పండుగగా గుర్తించే వరకూ కాంగ్రెస్ ప్రభుత్వం పట్టు వదలదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన అనంతరం ఫిబ్రవరిలో జరిగిన జాతరను దిగ్విజయంగా పూర్తి చేసిందని గుర్తు చేశారు. దేవాదాయ శాఖ మంత్రిగా తాను, గిరిజన ఆడబిడ్డ, మంత్రి సీతక్క జాతర ప్రాంత అభివృద్ధి కోసం, సౌకర్యాల కల్పన కోసం కృషి చేస్తున్నామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రం ప్రగతి బాటలో పయనించాలని, రాష్ట్ర ఆర్థిక కష్టాలు గట్టెక్కాలని అమ్మవార్లను వేడుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీ శ్రీకాంత్‌రావు, అసిస్టెంట్ కమిషనర్ సునీత, తహసీల్దార్ రవీందర్, ఈఓ రాజేంద్రం, డీఈ రమేశ్, ఇన్‌స్పెక్టర్ కవిత, సూపరింటెండెంట్ క్రాంతికుమార్, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, పూజారులు కాక వెంకటేశ్వర్లు, సిద్ధబోయిన మునీందర్, కాక కిరణ్ పాల్గొన్నారు.



సమ్మక్క గద్దె వద్ద పూజలు చేస్తున్న మంత్రి కొండా సురేఖ, మురళీధర్ దంపతులు

రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

- కేయూ ప్రైవేట్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉపేందర్ రెడ్డి

హన్మకొండ: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని కాకతీయ యూనివర్సిటీ ప్రైవేట్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉపేందర్ రెడ్డి, ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ వేణుమాధవ్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ మూడు రోజుల నుంచి ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల బంద్ పాటిస్తున్న యాజమాన్యాలు బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద శాంతి దీక్ష చేపట్టారు. అనంతరం ఇక్కడి నుంచి సుబేదారిలోని హనుమకొండ కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అడిషనల్ కలెక్టర్ వెంకట్ రెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత సంవత్సరం నవంబర్‌లో విడుదల చేసిన టోకెన్ నంబర్లకు సంబంధించిన రూ.600 కోట్ల బకాయిలు విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్‌ను కాపాడాలని కోరారు. లేని పక్షంలో కళాశాలల నిరవధిక బంద్ కొనసాగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో టీపీడీఎంఏ సభ్యులు శ్రీధర్ రావు, రవీంద్రనాథ్, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, జిల్లా కోఆర్డినేటర్, గోలి వెంకట్, తదితరులు పాల్గొన్నారు.



దీక్ష చేస్తున్న ప్రైవేట్ యాజమాన్యాలు

బాలిరెడ్డికి రాజీవ్‌గాంధీ నేషనల్ అవార్డు

సంగెం: వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలోని జాతీయ ఆదర్శ గ్రామం మరియపురం మాజీ సర్పంచ్, ప్రముఖ పారిశ్రామిక వేత్త అల్లం బాలిరెడ్డి జాతీయస్థాయిలో ఉత్తమ సర్పంచ్‌గా ఎంపికయ్యారు. తిరుపతికి చెందిన అకాడమీ ఆఫ్ గ్రాస్ రూట్స్ స్టడీస్ అండ్ రీసెర్చ్ ఆఫ్ ఇండియా (అగ్రసీ) సంస్థ రాజీవ్‌గాంధీ గ్రామ్ స్వరాజ్ నేషనల్ అవార్డు 2023కు బాలిరెడ్డిని ఎంపిక చేసింది. ఈ సంస్థ ప్రతి ఏడాది దేశంలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన ఆరుగురిని ఎంపిక చేసి అవార్డు అందజేస్తుంది. 2022–23 ఏడాదిలో అందించిన సేవలను గుర్తించి జాతీయస్థాయిలో ఉత్తమ సర్పంచ్‌గా బాలిరెడ్డిని ఎంపిక చేసినట్లు అగ్రసీ సంస్థ చైర్ పర్సన్ డి. భారతీసుందర్ లేఖను పంపించినట్లు బాలిరెడ్డి తెలిపారు. ఈ నెల 17వతేదీన ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో బాలిరెడ్డికి రాజీవ్‌గాంధీ గ్రామ్ స్వరాజ్ నేషనల్ అవార్డును అందజేయనున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని బుధవారం మరియపురం గ్రామస్తులు బాలరాజు, మోహన్, జితేందర్, విజయ, స్వాతి తదితరులు బాలిరెడ్డిని ఘనంగా సన్మానించారు.



బాలిరెడ్డిని సన్మానిస్తున్న మరియపురం గ్రామస్తులు

నాసిరకం విత్తనాలతో నష్టం

- వరికంకులతో సొసైటీ కార్యాలయం ఎదుట రైతుల ఆందోళన

కురవి: నాసిరకం విత్తనాలతో కాలవ్యవధికి ముందే వరి పంట చేతికొచ్చిందని ఆరోపిస్తూ పలువురు రైతులు బుధవారం మహబూబాబాద్ జిల్లా కురవి మండలం గుండ్రాతిమడుగుడు(విలేజి)లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ఎదుట బుధవారం ఆందోళన చేపట్టారు. వారి కథనం ప్రకారం.. గుండ్రాతిమడుగు(విలేజి) గ్రామానికి చెందిన రైతులు కుంభం మైసయ్య, కేతం రామన్న, అబ్బగాని సూరయ్య, గాండ్ల లచ్చయ్య, బానోత్ దీప్లా, అజ్మీరా లాలుతోపాటు మరికొందరు రైతులు గ్రామ సొసైటీలో దొడ్డు రకం వరి జేజీఎల్ విత్తనాలు కొనుగోలు చేశారు. ఈ పంట 125 రోజులకు చేతికొస్తుందని అధికారులు చెప్పగా, 75 రోజులకే కోతకొచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ముందుగానే పంట చేతికిరావడంతో తాలుగా మారిందన్నారు. ఎకరానికి రూ.30వేలు పెట్టుబడి అయిందని, నాసిరకం విత్తనాలతో నష్టపోయామని తెలిపారు. సొసైటీ అధికారులను అడిగితే తమకేమి సంబంధం లేదని చెబుతున్నారన్నారు. నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.



వరికంకులతో ఆందోళన చేస్తున్న రైతులు

పరీక్షలకు వేళాయె..

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎస్‌ఏ–1
- ఒకటి నుంచి 10వ తరగతి విద్యార్థులకు..
- ఈనెల 21 నుంచి 28వ తేదీ వరకు నిర్వహణ



విద్యారణ్యపురి: విద్యార్థులకు దసరా సెలవులు ముగిశాయి. ఈనెల 15 నుంచి తరగతులు పునః ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో ఈ విద్యాసంవత్సరానికి(2024–2025) సంబంధించి సమ్మేటివ్ అసెస్‌మెంట్ (ఎస్‌ఏ)–1 పరీక్షల షెడ్యూల్‌ను విద్యాశాఖ విడుదల చేసింది. ఈమేరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని హనుమకొండ, వరంగల్, ములుగు, మహబూబాబాద్, జనగామ, జయశంకర్‌భూపాలపల్లి జిల్లాలో అన్ని యాజమాన్యాల పరిధిలో ఒకటి నుంచి 10వ తరగతి వరకు ఈ పరీక్షలు నిర్వహించబోతున్నారు. ఈమేరకు డీఈఓలు కూడా హెచ్‌ఎంలకు పరీక్షల నిర్వహణపై ఆదేశాలు జారీచేశారు. టైంటేబుల్ కూడా విడుదల చేశారు. పాఠశాలల్లో విద్యార్థులను అందుకు సన్నద్ధం చేస్తున్నారు.

టైంటేబుల్..

ఈనెల 21న ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు ఫస్ట్‌లాంగ్వేజ్ తెలుగు, ఉర్దూ, ఆరో తరగతి విద్యార్థులకు ఫస్ట్‌లాంగ్వేజ్ తెలుగు, ఉర్దూ, 8,9,10 తరగతుల విద్యార్థులకు మ్యాథ్స్‌మెటిక్స్, ఏడో తరగతికి ఫస్ట్ లాంగ్వేజ్ తెలుగు, ఉర్దూ పరీక్షలు నిర్వహించాల్సింటుంది.

- 22న ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు ఇంగ్లిష్, ఆరు,ఏడు తరగతుల సెకండ్‌లాంగ్వేజ్ హిందీ, తెలుగు, 8,9,10వ తరగతి విద్యార్థులకు ఫిజికల్ సైన్స్ పరీక్షలు నిర్వహించాల్సింటుంది.
- 23న ఒకటి నుంచి 5వతరగతి వరకు మ్యాథ్‌మెటిక్స్, ఆరు, ఏడు తరగతులకు థర్డ్ లాంగ్వేజ్ ఇంగ్లిష్, 8,9,10వ తరగతులకు బయాలజికల్ సైన్స్ పరీక్షలు నిర్వహిస్తారు.
- 24న ఒకటి నుంచి 5వ తరగతి విద్యార్థులకు ఈవీఎస్, 6,7,8,9,10వతరగతి విద్యార్థులకు సోషల్ స్టడీస్ సబ్జెక్టుల పరీక్షలు నిర్వహించాల్సింటుంది.
- 25న ఆరో తరగతి విద్యార్థులకు మ్యాథ్‌మెటిక్స్, 8,9,10వ తరగతులకు ఫస్ట్‌లాంగ్వేజ్ (తెలుగు, ఉర్దూ), 7వ తరగతి విద్యార్థులకు మ్యాథ్‌మెటిక్స్ పరీక్షలు నిర్వహించాల్సింటుంది.
- 26న ఆరు, ఏడో తరగతి విద్యార్థులకు జనరల్ సైన్స్, 8,9,10 తరగతులకు సెకండ్ లాంగ్వేజ్ (హిందీ, తెలుగు) పరీక్షలు నిర్వహించాల్సింటుంది.
- 28న 8,9,10 తరగతుల విద్యార్థులకు థర్డ్ లాంగ్వేజ్ ఇంగ్లిష్ సబ్జెక్టుల పరీక్షలు నిర్వహిస్తారు.

పరీక్షల సమయం ..

➤ **ఉదయం..**

ఎస్‌ఏ–1 పరీక్షలు ఉదయం సెషన్‌లో ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 6 8, తరగతుల విద్యార్థులకు ఉదయం 9.15 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆయా తేదీల్లో నిర్వహించాల్సింటుంది,

➤ **మధ్యాహ్నం సెషన్‌లో..**

7,9 తరగతుల విద్యార్థులకు మధ్యాహ్నం సెషన్‌లో నిర్వహిస్తారు. అందులో 7వతరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 1.15 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు, తొమ్మిదో తరగతి విద్యార్థులకు 1.15 నుంచి సాయంత్రం 4–15 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు.

సినీ ఫక్కీలో చోరీ..

- బైక్ ట్యాంక్ కవర్ నుంచి రూ. 3.10 లక్షల అపహరణ
- స్టేషన్ ఘన్‌పూర్‌లో ఘటన
- లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించిన బాధిత రైతు

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో సినీ ఫక్కీలో చోరీ జరిగింది. రోడ్డు పక్కన నిలిపిన బైక్ ట్యాంక్ కవర్ నుంచి దుండగులు రూ.3.10 లక్షల నగదును అపహరించుకెళ్లారు. పోలీసుల కథనం ప్రకారం.. జఫర్‌గఢ్ మండలం తిమ్మంపేటకు చెందిన రైతు మంద రాజు వ్యక్తిగత పనుల నిమిత్తం బుధవారం తన బైక్‌పై ఘన్‌పూర్‌కు వచ్చాడు. ఘన్‌పూర్‌లో వివేకానంద చౌరస్తా వద్ద బరోడా బ్యాంకులో క్రాప్‌లోన్‌కు సంబంధించిన రూ.1.10 లక్షలు తీసుకున్నాడు. అనంతరం ఆంధ్రాబ్యాంకుకు వెళ్లి అందులో హౌసింగ్‌లోన్‌కు సంబంధించిన రూ.2లక్షలు తీసుకున్నాడు. మొత్తం రూ.3.10 లక్షలు నగదు బైక్ ట్యాంక్ కవర్‌లో పెట్టి తిమ్మంపేటకు బయలుదేరాడు. ఈ క్రమంలో తన కుమార్తెకు పుస్తకాలు కొనుగోలు చేసేందుకు కొత్త గాంధీ చౌరస్తా సమీపాన కిరణ్‌బుక్‌స్టాల్ వద్ద రోడ్డు పక్కన బైక్‌ను పార్క్ చేసి బుక్‌స్టాల్‌లోకి వెళ్లాడు. బుక్‌స్టాల్‌లోకి వెళ్తుండగానే అతడిని అనుసరించి వచ్చిన ఇద్దరు దుండగులు.. బైక్ ట్యాంక్ కవర్‌లో ఉన్న డబ్బులు తీసుకుని ఉడాయించారు. గమనించిన రాజు కేకలు వేస్తూ బుక్‌స్టాల్ నుంచి బైక్‌వద్దకు వచ్చేసరికే దుండగులు అక్కడ నుంచి పరారయ్యారు. దుండగుల్లో ఒకరు స్కూటీ నడుపుతుండగా వెనుక ఉన్న వ్యక్తి బైక్ ట్యాంక్ కవర్‌లో నుంచి డబ్బులు తీసుకుని వెళ్లారని బాధితుడు రోదిస్తూ తెలిపాడు. ఈ విషయం తెలుసుకున్న సీఐ జి.వేణు ఘటనా స్థలికి చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. షాపులు, ఆంధ్రాబ్యాంకు వద్ద సీసీ ఫుటేజీని పరిశీలించారు. నిందితులు బ్యాంకు వద్ద నుంచే రాజును వెంబడించి ఉంటారని భావిస్తున్నారు. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వేణు తెలిపారు.



రోదిస్తున్న బాధితుడు మంద రాజు

స్కూటీలోని బంగారం ఉన్న బ్యాగు మాయం..

భూపాలపల్లి అర్బన్: బ్యాంకులో తాకట్టు పెట్టిన బంగారం విడిపించుకొని స్కూటీలో పెట్టుకున్న బ్యాగు మాయమైంది. ఈ ఘటన బుధవారం భూపాలపల్లి పట్టణంలో జరిగింది. సీఐ నరేశ్‌కుమార్ కథనం ప్రకారం.. మంజూర్‌నగర్ సమీపంలోని వెయ్యి క్వార్టర్ల కాలనీకి చెందిన సలీంద్ర అరుణ, తన కుమారుడు విజయ్‌కుమార్ పట్టణంలోని యూనియన్ బ్యాంకులో తాకట్టు పెట్టిన 6 తులాల బంగారం విడిపించుకున్నారు. తమ సెల్ ఫోన్, బంగారం హాండ్‌బ్యాగులో పెట్టి స్కూటీ డిక్కీలో భద్రపరిచారు. ఇంటికి వెళ్తున్న క్రమంలో మార్గమధ్యలో మంజూర్‌నగర్‌లో సోమేశ్వర మెడికల్ షాపులో మెడిసిన్ కొనుగోలు చేశారు. ఇంటికి వెళ్లిన అనంతరం స్కూటీ డిక్కీ తెరిచి చూడగా బ్యాగు కనిపించలేదు. దీంతో లబోదిబోమంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ నరేశ్‌కుమార్ తెలిపారు.

నకిలీ వైద్యులపై చర్యలు తీసుకోవాలి

ఎంజీఎం : నకిలీ వైద్యులపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ మెడికల్ కౌన్సిల్ (టీజీఎంసీ) పబ్లిక్ రిలేషన్ కమిటీ చైర్మన్ నరేశ్‌కుమార్, హెచ్‌ఆర్‌డీఏ వరంగల్ జిల్లా నాయకుడు దొమ్మాటి ప్రసన్న కోరారు. ఈ మేరకు బుధవారం జిల్లా కాలుష్య నియంత్రణ మండలి అధికారి ఆర్.సునీతను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నకిలీ వైద్యులు ఇష్టానుసారంగా, అశాస్త్రీయంగా ఇచ్చే స్టెరాయిడ్స్, యాంటీబయోటిక్స్ వల్ల ప్రజారోగ్యానికి ముప్పు పొంచి ఉందని, వారు పడేసే బయోమెడికల్ వ్యర్థాల ద్వారా పర్యావరణానికి తీవ్ర నష్టంతో పాటు ప్రజారోగ్యం దెబ్బతింటుదన్నారు. పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్య బలోపేతం దృష్ట్యా ఇలాంటి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్న నకిలీ వైద్యులుపై కాలుష్య నియంత్రణ మండలి తరఫున చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి సునీత స్పందిస్తూ.. నకిలీ వైద్యులు ఇష్టానుసారంగా ఉపయోగించే మందులపై డ్రగ్ కంట్రోల్ అధికారుల సమన్వయంతో కొద్ది రోజుల క్రితం వరంగల్‌లో కేసులు నమోదు చేశామన్నారు. ఇప్పుడు మరోసారి కాలుష్య నియంత్రణ అధికారుల సమన్వయంతో కాలుష్య నివారణ చట్టం ద్వారా కూడా కేసులు నమోదయ్యేలా ప్రయత్నాలు చేస్తున్నట్లు వివరించారు.



కాలుష్య నియంత్రణ మండలి అధికారి సునీతకు వినతిపత్రం అందజేస్తున్న నరేశ్‌కుమార్, ప్రసన్న

‘రైల్వే మజ్దూర్’లో యువతకు పెద్దపీట

- యూనియన్ నేతలు శ్రీనివాస్, రవీందర్

కాజీపేట రూరల్: సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ యువతకు పెద్దపీట వేస్తోందని ఆ యూనియన్ సికింద్రాబాద్ జోనల్ ప్రెసిడెంట్ కాల్వ శ్రీనివాస్, సికింద్రాబాద్ డివిజనల్ సెక్రటరీ పి.రవీందర్ అన్నారు. కాజీపేట రైల్వే మజ్దూర్ యూనియన్ కార్యాలయంలో బుధవారం మజ్దూర్ యూనియన్ యువ సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, రవీందర్ మాట్లాడుతూ రైల్వే కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడుతున్న యూనియన్‌లో యువత ముఖ్య భూమిక పోషించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ సికింద్రాబాద్ డివిజన్ ప్రెసిడెంట్ ఖాజాబాబా, కాజీపేట కోఆర్డినేటర్ నాయిని సదానందం, రైల్వే సీసీఎస్ డైరెక్టర్ శ్రీనివాస్‌యాదవ్, నాయకులు సమ్మయ్య, బచ్చల శ్రీనివాస్, బాలమునిరాజు, యూత్ కోఆర్డినేటర్ ఫారుఖ్,అక్బర్, ఎస్‌కె.జానీమియా, పి.వేదప్రకాశ్, సాయికుమార్, యుగేందర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జోనల్ ప్రెసిడెంట్ శ్రీనివాస్

తెల్లారితే హాస్టల్‌కు..ఆలోపే అనంతలోకాలకు

లారీ ఢీకొని విద్యార్థి దుర్మరణం
- ఇద్దరికి తీవ్రగాయాలు
- పెద్దాపూర్‌లో ఘటన
- ముగ్గురు మైనర్లే..



వెంకటేశ్ (ఫైల్)

భూపాలపల్లి రూరల్: మాయదారి మృత్యువు మాటు వేసి కాటు వేసింది. తెల్లారితే హాస్టల్‌కు వెళ్లేవాడు. అంతలోనే వాహన రూపంలో బలి తీసుకుంది. లారీ.. బైక్‌ను ఢీకొన్న ప్రమాదంలో ఓ విద్యార్థి మృతి చెందగా, ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన బుధవారం భూపాలపల్లి మండలం పెద్దాపూర్‌లో చోటు చేసుకుంది. ములుగు జిల్లా వెంకటాపురం ఎస్సై సతీశ్, స్థానికుల కథనం ప్రకారం.. గణపురం మండలం జంగుపల్లి గ్రామానికి చెందిన పేరాల వెంకటేశ్ (16), మేముల మణి ప్రసాద్, జక్కిరాజు జశ్వంత్ ద్విచక్రవాహనంపై పెద్దాపూర్ వెళ్తున్నారు. ఈక్రమంలో భూపాలపల్లి నుంచి వెంకటాపురం వైపునకు బూడిద లోడ్‌తో వెళ్తున్న లారీ.. పెద్దాపూర్ శివారులో బైక్‌ను వెనుక నుంచి ఢీకొంది. దీంతో వెంకటేశ్ అక్కడిక్కడే మృతి చెందాడు. వేముల మణి ప్రసాద్, జక్కిరాజు జశ్వంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగ్రాతులను 108లో భూపాలపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ తరలించినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు.

తెల్లారితే హాస్టల్‌కు వెళ్లేవారు..

మృతుడు వెంకటేశ్ కాటారంలోని ఆదర్శ పాఠశాలలో 9వ తరగతి, మణి ప్రసాద్ నర్సంపేటలోని బిట్స్ కళాశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్, జక్కిరాజు జశ్వంత్ భూపాలపల్లిలోని ఓ కళాశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నారు. గురువారం హాస్టళ్లకు వెళ్లే క్రమంలో వీరు కటింగ్ చేయించుకోవడం కోసం జంగుపల్లి నుంచి పెద్దాపూర్ వెళ్తున్న క్రమంలో ప్రమాదం జరిగింది. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా, రోడ్డు ప్రమాద ఘటన తెలిసిన వెంటనే భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హుటాహుటిన హైదరాబాద్ నుంచి నేరుగా భూపాలపల్లి వంద పడకల ఆస్పత్రికి చేరుకుని మార్చురీలో ఉన్న వెంకటేశ్ మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.